క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రికి అభినందనలు


ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు అభినందనలు చెబుతున్న క్రిస్టియన్ మైనారిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సోమవారం తాడేపల్లిగూడెం మంత్రి కార్యాలయంలో ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రం జార్జ్ బెనహార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గెద్దం జ్యోతి ఆనంద్, ఉపాధ్యక్షుడు పి.సంపదరావు, బేతాళ సంతోష్, సెక్రటరీలు మెడవంకల రత్నకుమార్, ప్రిన్స్ ప్రేమ్ సన్, కందికట్ల ఎడ్వర్డ్ గాదేపాల్ సుధీర్, మేడిద శ్యామ్, స్టాన్లీ రాబర్ట్, మోసాల అశోక్, బొంతు శ్యాంబాబు, ర్యాలీ రత్నకుమార్, కత్తుల జస్పాల్, జాయింట్ సెక్రటరీలు రొక్కాల నాగబుజ్జి, వెంద్రపాటి మోహన్‌రావులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉంటే ఆదర్శ అవార్డును రొక్కాల నాగ బుజ్జికి మంత్రి అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


వృద్ధ మహిళకు పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని బోధిగట్టు 23వవార్డు వృద్ధురాలు తుర్ల సావిత్రి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ రాజమండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒంటరి మహిళా, వృద్ధురాలు కావడం, ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న దృష్ట్యా వార్డు వలంటీర్ దిర్సాల వరలక్ష్మి సోమవారం రాజమండ్రికి వెళ్లి ఆమెకు రూ.3వేలను పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు వలంటీర్‌ని సేవలను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఇరగవరంలో రెండోరోజు ప్రారంభమైన ప్రజా దీవెనయాత్ర


రేలంగిలో సచివాలయ భవన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో ఆయన చేపట్టిన ప్రజా దీవన యాత్ర రెండో రోజు కొనసాగింది. పాదయాత్రలో దారి పొడవునా మంత్రికి మహిళలు, హారతులిచ్చి ఘన స్వాగతం పలకగా వృద్ధులు తమ ఆశీస్సులు అందించారు. తామంతా మీ వెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్తకంఠంతో తెలిపారు. స్థానికులు తెలిపిన సమస్యలు విని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేలంగిలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఎంపీటీసీ మెట్ల కిరణ్మయి, మహాలక్ష్మి, మెంట రాజు, నాయకులు చెబ్రోలు పెద్దిరాజు, పులుపు అనిల్, పులుపు సునీల్, పులుపు అక్కమాంబ, పులుపు శ్రీను, వడ్డే మార్కెండేయులు, మైనం పాము, బాబీ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేలంగి గ్రామంలో దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మాల మహానాడు నాయకు చీకటిమిల్లి మంగరాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, చేబ్రోలు పెద్దిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్ ప్రయాణం హామీ ఇవ్వవద్దు

తణుకు అర్బన్ : పట్టణంలో ఆటో కార్మికులందరూ సోమవారం ఉదయం నుంచి నిరసన వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామనడం ఆటో కార్మికుల పొట్ట కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ఆటో యూనియన్ జేఏసీనాయకులు రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీటీసీ):ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్‌ప్రయాణాలు వంటి హామీలతో ఆటోవాలాలకు ఉపాధి దెబ్బతింటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లిగూడెం ఏరియా ఆటో కార్మికులు బంద్ నిర్వహించి నిరసన శిబిరాల్లో ఆందోళనలు నిర్వహించారు.

బాధితులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పెదముత్తి ముసలయ్య కుటుంబానికి గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్టీలు సామగ్రిని అందజేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

పెంటపాడు: దాతలు అందించిన సాయంతో విద్యార్థులు ఉన్నతంగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల వెంకట కోటేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం పెదవెల్లమిల్లికి చెందిన కంభంపాటి సుబ్బారావు, పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు అందించిన విద్యాసామగ్రిని విద్యార్థులకు సర్పంచ్ అందజేశారు.

తణుకులో విస్తరిస్తున్న వైద్యరంగం


తణుకులో స్వాగతం తెలిపే ముఖద్వారం

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు పట్టణంలో ప్రైవేటు ఆస్పత్రులు సైతం అధునాతన వసతులతో తీర్చిదిద్దబడ్డాయి. వైద్యరంగంలో తాజాగా వచ్చిన నూతన ఆవిష్కరణలకు సంబంధించిన సౌకర్యాలు తణుకులో అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వచ్చే వారికి అత్యవసర విభాగాలు నాణ్యమైన సేవలందిస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తణుకు ప్రాంతంలో ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాల నుంచి సైతం తణుకు వచ్చి స్థిరపడే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతం తమ పరిధి పెంచుకుంటూ అభివృద్ధి చెందుతుంది. దీంతో నగరాల నుంచి సైతం వైద్యులు తణుకులాంటి ప్రాంతంలో అధికసంఖ్యలో హాస్పిటల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

అధునికి వైద్య సౌకర్యాలతో ఆస్పత్రులకు నిలయం

హాస్పిటల్స్ హబ్‌గా పేరుగాంచుతున్న తణుకు పట్టణ ప్రాంతంలో సుమారుగా 70కి పైగా ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి. గతంలో సుదీర్ఘ వ్యాధుల చికిత్సలకైనా, అత్యవసర వైద్య సేవల కోసమైనా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చేది. కానీ నేడు గుండె, న్యూరో, నెఫ్రాలజీ, యూరాలజీలతోపాటు అంకాలజీ వంటి వైద్య సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా తణుకు పట్టణ ప్రాంతం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఎక్కువ శాతం ప్రమాదాలకు సంబంధించి కేసులు వస్తుంటాయి. ఈ ప్రమాదాల్లో అధిక శాతం హెడ్ ఇన్‌జ్యూరీలతోపాటు ఆర్థోపెడిక్ విభాగాల్లో నాణ్యమైన వైద్యసేవలు అవసరమవుతుంటాయి. ఈ సేవలన్నీ తణుకులో వివిధ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.



వైద్య రంగంలో ముందంజ



తణుకులో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. అధునిక వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడంతో రోగు లు దూర ప్రాంతాలకెళ్లే పనిలేకుండా సెప్షలిస్టులు వైద్య సేవలు పొందుతున్నారు. అరుదైన శస్త్రచికిత్స లు కూడా తణుకు డాక్టర్లు చేస్తున్నారు. దీంతోపాటు జనరల్ సర్జరీల్లో గతంలో మాదిరిగా ఓపెన్ సర్జరీలకు తావులేకుండా లేటెస్ట్ పరికరాలతో లాప్రోస్కోఫిక్ సర్జరీ విధానంకూడా అందుబాటులో ఉంది. ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియల్ సర్జరీలుకూడా ఆవిష్కరించబడ్డాయి.

– డాక్టర్ నిమ్మగడ్డ ప్రదీప్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు, తణుకు